# తాడేపల్లివారి దురద గీతి

నిన్నటి నిజం

ప్రముఖ అష్టావధాని గాడేపల్లి కుక్కుటేశ్వరరావు నర్సరావుపేట కళాశాలలో బి.ఎ. విద్యార్థి. ఆయనతో మరో ఇద్దరు విద్యార్థులు గదిలో అద్దెకుంటున్నారు. రోజూ వారిగదికి మృత్యుంజయుడనే మిత్రుడు వచ్చిపోతూ ఉండేవాడు. అతనికి దురదల రూపమైన అంటువ్యాధి ఉండేది. రాత్రింబవళ్లూ ఆయన విద్యార్థుల పక్కల మీదే గడిపేవాడట. చూసి చూసి ఓ రోజు గాడేపల్లివారు 'నీవు రోజూ మా గదికి వస్తూపోతూ ఉండడంవల్ల మా వస్తువులు కొన్ని పోతున్నాయిరా!' అన్నారట. వెంటనే ఆ మిత్రుడు తెల్లబోయి 'ఏం పోయాయి? నిజంగా నాకేం తెలియదు' అన్నాడట. అప్పుడు గాడేపల్లి వారు తమాషాగా



'గోకి గోకియు మా(వ్రేళ్ల గోళ్లు పోయె
జేబులన్నియు వరుసగా చినిగిపోయె
తెగ బరుకుచుంట నిద్దుర ఎగిరిపోయె
నాడు నాదు చదువు చంకనాకిపోయె'

అని పద్యం ఆశువుగా చెప్పారట. వెంటనే సరసుడైన ఆ మిత్రుడు అమాంతంగా కౌగిలించుకోబోయి సందేహించాడట.

# తీగ తెగింది ఎందుకు?

కాకినాడలో సరస్వతీ గానసభలు జరుగుతున్నాయి. జమ్ములమడక మాధవరామ శర్మ వరద గోదావరిలా మాట్లాడారు. తర్వాత 'కొత్తకు చోటిచ్చి పాత తప్పుకుంటుంది' అంశంపై ఇంద్రగంటి ప్రసంగించారు. చివరిగా కాటూరి వెంకటేశ్వరరావు మొదలుపెట్టారు. అంతా తన్మయులై వింటుంటే కార్యనిర్వాహకుల్లో ఓ విద్యార్థి చీటీ పంపించాడు. 'ద్వారంవారి కచేరీ ఉంది. దయచేసి త్వరగా ముగించండి' అని ఉంది. వెంటనే కాటూరి గంభీరముద్ర వహించారు. ఎత్తుకున్న వాక్యాన్ని సైతం ముగించకుండా కత్తిరించినట్టు ఉపన్యాసాన్ని ఆపేశారు. సభ్యులతో 'ఇది సాహిత్య సభ అనుకున్నాను. పొరపాటు. సంగీత సభ అని ఇప్పుడే తెలిసింది. దానికి మా ప్రసంగాలు మంగళవాద్యాలు అనుకోలేదు. క్షమించండి' అని చట్టున లేచి తిరిగి చూడకుండా వెళ్లిపోయారు. ఈ చర్యతో శ్రావ్యంగా పలికే వీణ తీగ టప్పున తెగినట్టయింది.

# శ్రీపాదవారి కళా సేవ!

'కళాభివర్ధనీ పరిషత్తు'ను రాజమండ్రిలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి స్థాపించారు. కవి పండితులను గౌరవించడం ప్రజలకు నేర్పాలనే వారు శ్రీపాద. ధనవంతులను పట్టుకొని సభకు వక్తగా వచ్చిన కవిపండితులకు బహుమతిగా నూటపదహార్లు ఇచ్చేవారు. మేళతాళాలతో సభాస్థలికి వెళ్లేటప్పుడు అంగళ్లలోని వర్తకులు కారులోని పండితుడికి పూలదండలు వేసేవారు. అలాగే సభకు విచ్చేసిన ప్రముఖులచేత వక్తకు దండ వేయించేవారు. ఓసారి శ్రీనాథ జయంతికి మల్లంపల్లి సోమశేఖరశర్మ విచ్చేశారు. శ్రీపాద వక్తకు తాంబూలంతోపాటు ఓ కవరును ఇచ్చారు. ఆ కవరును పెట్టెలో పెట్టబోయి అనుకోకుండానే తెరిచారు. మల్లంపల్లి. అందులో కరెన్సీకి బదులు కాగితం ఉంది. 'అయ్యా! అనుకున్న ప్రకారం దాత నూటపదార్లు ఇవ్వకుండా ఊరెళ్లాడు. తమ ఔదార్యం ఈ లోపాన్ని క్షమిస్తుందని మా విశ్వాసం - కళాభివర్ధనీ పరిషత్తు' అని ఉంది. వేరే సందర్భంలో ఈ ఋణం తీర్చుకున్నారట శ్రీపాద.